సాక్షి రంగారెడ్డి

గురువారం । 11 । ఏప్రిల్ । 2024



అభివృద్ధిలో దేశం పరుగు

మోదీ పదేళ్ల పాలనలో భారత్ అభివృద్ధిలో దూసుకుపోతుందని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. 8లో▸



సస్పెన్షన్ ఎత్తివేత

సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ ఎమ్మెల్యే సబిత నిర్ణయం హర్షణీయమని బీఆర్‌ఎస్ నాయకుడు వాసుబాబు అన్నారు. 8లో▸



దొంగలకు రిమాండ్

మోటారు వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. 8లో▸

న్యూస్‌రీల్

నేడు, రేపు జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

యాచారం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవాల సందర్భంగా ఈ నెల 11, 12 తేదీల్లో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జై భీమ్ ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ.. నందివనపర్తి గ్రామంలో నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనదలిచిన వారు 7780598551, 7337488307, 9505396315 నంబర్లలో సంప్రదించాలన్నారు. రూ.350 ఎంట్రీ ఫీజు చెల్లించి టీం పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

మాల్ సంత నిర్వహణకు వేలం

యాచారం: మాల్ పశువుల సంత నిర్వాహణకు బుధవారం మాల్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వేలం నిర్వహించారు. పశువుల సంత నిర్వాహణకు ఇద్దరు పోటీ పడగా వేలంలో నల్గొండ జిల్లా నార్కట్‌పల్లికి చెందిన ముత్యాల ఆంజనేయులు రూ.75,53,000లకు దక్కించుకున్నాడు. తైబజార్ నిర్వాహణకు ఇద్దరు పోటీ పడగా మాల్ గ్రామానికి చెందిన గుడుకుంట్ల కృష్ణ రూ.1,16,700లకు దక్కించుకున్నాడు పశువుల సంత, తైబజార్‌ను దక్కించుకున్న వారు 2025 మార్చి 30 వరకు నిర్వాహణ అనుమతులుంటాయని మాల్ పంచాయతీ కార్యదర్శి రాజు తెలిపారు.

అడిషనల్ డీసీపీ ఆకస్మిక తనిఖీ



ఠాణాలో రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ రామ్ కుమార్

ఆమనగల్లు: పట్టణంలోని పోలీసు స్టేషన్‌ను బుధవారం శంషాబాద్ జోన్ అడిషనల్ డీసీపీ రామ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలతో పాటు రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బంది పని తీరును తెలుసుకున్నారు. పాత కేసుల వివరాలను పరిశీలించి పోలీసులకు అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్ పలుసూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు సీఐ ప్రమోద్ కుమార్, ఎస్‌ఐ బలరాం, సిబ్బంది ఉన్నారు.

అనుమానాస్పద వాహనాలు తప్పక తనిఖీ చేయాలి

డీసీపీ సునీతారెడ్డి



ఆగాపల్లి చెక్‌పోస్టు వద్ద పోలీసులకు సూచనలిస్తున్న డీసీపీ సునీతారెడ్డి

మంచాల: అనుమానాస్పద వాహనాలను కచ్చితంగా తనిఖీలు చేయాలని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం ఆమె మండల పరిధిలోని నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై ఆగాపల్లి చెక్ పోస్టును సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసులకు పలు సూచనలిచ్చారు. ఎన్నికల నిబంధనలను తప్పక పాటించాలన్నారు. రూ.50వేలకు పైగా నగదు తరలింపునకు అనుమతి లేదన్నారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. చట్టరీత్యా బాధితులపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ కేపీవీ రాజు, సీఐ బబ్యా నాయక్, ఎస్‌ఐ రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రలోభాలకు తావివ్వొద్దు

మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్



ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

మీర్‌పేట: ప్రలోభాలకు తావివ్వకుండా ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.చంద్రశేఖర్ సూచించారు. బుధవారం కార్పొరేషన్ పరిధిలో 2024–స్వీప్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నిజాయతిగా ఓటుహక్కును వినియోగించుకోని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామన్నారు. బాలాపూర్ చౌరస్తా నుంచి మీర్‌పేట కూడలి వరకు ఓటు హక్కు విలువను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకట్‌రెడ్డి, మెప్మా, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లపై ఫోకస్



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి సబితారెడ్డి

లోక్ సభ ఎన్నికలపై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఈ నెల 13న చేవెళ్ల నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. ఇప్పటికే ఇందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. బీజేపీ, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టనున్నారు. సిట్టింగ్ స్థానాన్ని ఎలాగైనా దక్కించుకోవాలనే పట్టుతో పార్టీ నేతలు పనిచేస్తున్నారు.

13 నుంచి బీఆర్‌ఎస్ అధినేత ఎన్నికల ప్రచారం

- సాయంత్రం 4 గంటలకు భారీ బహిరంగ సభ
- ఇదే వేదికగా లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం
- సభ సక్సెస్ కోసం సెగ్మెంట్‌లవారీగా టార్గెట్లు
- ఇప్పటికే నియోజకవర్గాల వారీగా సమీక్షలు పూర్తి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: చేవెళ్ల సభపై బీఆర్‌ఎస్ ఫోకస్ పెట్టింది. ఈ నెల 13న సాయంత్రం 4 గంటలకు చేవెళ్ల కేంద్రంగా నిర్వహించే ఈ సభకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సహా పార్టీ ప్రముఖులంతా హాజరు కానుండటంతో సభను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. జన సమీకరణ, వేదిక ఏర్పాటు వంటి బాధ్యతలను ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అప్పగించారు. ఈ మేరకు ఇటీవల జిల్లా మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, ఎమ్మెల్సీ సురభి వాణి దేవితో కలిపి పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పలువురు జిల్లా నేతలు సభా స్థలిని పరిశీలించారు. జన సమీకరణ కోసం సెగ్మెంట్ల వారీగా టార్గెట్లు విధించుకున్నారు. రెండు లక్షల మందికి తగ్గకుండా తెలంగాణ వాదులు, పార్టీ అభిమానులను ఈ సభకు తరలించి చేవెళ్ల వేదికగా లోక్‌సభ ఎన్నికల ప్రచానికి శంఖారావం పూరించాలని నిర్ణయించారు. పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కేసీఆర్, కేటీఆర్‌లు ఇప్పటికే సెగ్మెంట్ల వారీగా ముఖ్య నేతలతో సమీక్షా సమావేశాలు పూర్తి చేశారు.

హ్యాట్రిక్ విజయానికి సన్నద్ధం

బీఆర్‌ఎస్‌కు చేవెళ్ల లోక్‌సభ పరిధిలో గట్టిపట్టుంది. 2014, 2019 ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థులే విజయం సాధించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగు సెగ్మెంట్లలో గులాబీ జెండా ఎగురవేయగా.. వికారాబాద్, పరిగి, తాండూరు నియోజకవర్గాలు హస్తగతమయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం వికారాబాద్ జిల్లా పరిధిలో ఉండడంతో ఈ సెగ్మెంట్‌ను ఆయన ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఎలాగైనా విజయకేతనం ఎగురవేయాలని భావించారు. ఇందులో భాగంగానే మాజీ మంత్రి, సిట్టింగ్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఆయన సతీమణి వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. చేవెళ్ల లోక్‌సభ స్థానం నుంచి సునీతారెడ్డి పోటీ చేస్తారనే సంకేతాలు ఇచ్చారు. సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి సైతం కారు దిగి కాంగ్రెస్‌లో చేరడంతో.. చేవెళ్ల పార్లమెంటు స్థానంపై ఆశలు పెట్టుకున్న సునీతారెడ్డిని మల్కాజిగిరికి మార్చారు. సిట్టింగ్ ఎంపీ పార్టీని వీడడంతో ఆయన స్థానంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన మాజీ జెడ్పీ చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ప్రకటించింది. లోక్‌సభ పరిధిలో ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఓట్లు అధికంగా ఉండడం అభ్యర్థికి కలిసి వస్తుందని గులాబీ దళం భావిస్తోంది. సిట్టింగ్ సీటు చేజార్చుకోవద్దని పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ రంగంలోకి పార్లమెంటు ఎన్నికల ప్రచారం చేవెళ్ల నుంచే ప్రారంభించాలనే యోచనతో తొలి సభను చేవెళ్ల నుంచే ప్రారంభించేందుకు నిర్ణయించారు. అధికారంలో ఉన్నప్పుడు పదవులు అనుభవించి ఆపత్కాలంలో పార్టీని వీడిన వారికి సైతం ఇదే వేదికగా బుద్ధి చెప్పాలని భావిస్తోంది.

అభివృద్ధే అభ్యర్థిని గెలిపిస్తుంది

బీఆర్‌ఎస్ హయాంలోనే జిల్లా అభివృద్ధి చెందింది. ఉమ్మడి జిల్లాను మూడు జిల్లాలుగా విభజించి, మూడు కలెక్టరేట్లు, మూడు మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించింది. జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలను తీసుకొచ్చి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించింది. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజా అభివృద్ధికి బాటలు వేశారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధే అభ్యర్థిని గెలిపిస్తుంది. ఈ నెల 13న చేవెళ్ల కేంద్రంగా నిర్వహించే సభకు ప్రజలు పెద్ద ఎత్తున విచ్చేసి విజయవంతం చేయాలి. కష్ట కాలంలో కారుకు అండగా ఉందాం.. చేవెళ్ల లోక్ సభలో హ్యాట్రిక్ విజయం అందిద్దాం.

– సబితారెడ్డి, మహేశ్వరం ఎమ్మెల్యే

బీజేపీతోనే సుపరిపాలన

- కాంగ్రెస్‌వి అమలుకు నోచుకోని హామీలు
- సీఎం రేవంత్ అవినీతిపరుడు
- ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ కనుమరుగు
- ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: బీజేపీతోనే సుపరిపాలన సాధ్యమని.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అమలుకు నోచుకోని హామీలతో అధికారంలోకి వచ్చిందని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన బీజేపీ కార్యాలయాన్ని పార్టీ భువనగిరి లోక్‌సభ అభ్యర్థి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ మధ్య జరుగుతున్న ఎన్నికల పోరాటం ధర్మానికి, అధర్మానికి యుద్ధమని గుర్తించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అత్యంత అవినీతి పరుడని ఆరోపించారు. ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ కనుమరుగవ్వడం ఖాయమని జోస్యం చెప్పారు. వరంగల్‌లో ఆ పార్టీ నుంచి లోక్‌సభకు పోటీ చేసే అభ్యర్థులు కరువయ్యారని ఎద్దేవా చేశారు. అమలుకు సాధ్యం కాని హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రైతు రుణమాఫీకి ఇప్పటికీ అతీగతీ లేదన్నారు. భద్రాచలంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు అగ్గిపెట్టెను తలపిస్తున్నాయని విమర్శించారు. ఆడబిడ్డలకు ఇస్తామన్న రూ.2,500 వంద రోజులు పూర్తయినా ప్రారంభించ లేదని ధ్వజమెత్తారు. ప్రజాపాలనలో భాగంగా తీసుకున్న అప్లికేషన్లు ఎక్కడున్నాయో వారికే తెలియదన్నారు. ఎన్నికల ముందు రకరకాల ఆరోపణలు చేసి సీబీఐ ఎంక్వయిరీ చేయిస్తామని.. కాళేశ్వరంలో రూ.లక్ష కోట్ల కుంభకోణం అయిందని ఆరోపించిన హస్తం నేతలు ప్రస్తుతం మెగా కృష్ణారెడ్డితో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి కొడంగల్‌కే ముఖ్యమంత్రిగా మారాడని.. ప్రజల ముందుకు వెళ్లే శక్తి లేదన్నారు. ప్రపంచంలో భారతదేశం తలెత్తుకుని నిలబడేలా చేసిన ఘనత బీజేపీదేనన్నారు. రక్షణ రంగం బలోపేతమైందని.. విదేశీ పెట్టుబడులు విరివిగా వస్తున్నాయని, ఆవాస్ యోజన, ఉజ్వల పథకంతో అందరికీ న్యాయం జరుగుతోందని వివరించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అలియాస్ ఉత్తమ్‌ఖాన్‌కు హిందువులంటే మంట అని మండిపడ్డారు. సీఏఏతో ఎవరికీ నష్టం లేదన్నారు. కాంగ్రెస్ పాలన దేశానికి నష్టమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాచం వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకులు బోసుపల్లి ప్రతాప్, కొప్పు బాషా, పోరెడ్డి అర్జున్‌రెడ్డి, నర్సింహారెడ్డి, యాదిరెడ్డి, అంజయ్యయాదవ్, లచ్చిరెడ్డి, నారాయణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నంలో మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, చిత్రంలో బూర నర్సయ్యగౌడ్

ఎరువుల విక్రయానికి నిబంధనలు

- ఈ–పాస్ యంత్రం ద్వారానే అమ్మకాలు చేపట్టాలి
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న గీతారెడ్డి

కద్లాల్: ఈ పాస్ మిషన్ ద్వారానే రైతులకు ఎరువులను విక్రయించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి దుకాణాదారులకు సూచించారు. బుధవారం ఆమె వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పలు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా షాపులలో యూరియా, కాంప్లెక్స్ ఎరువుల నిల్వ, అమ్మకాలు, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ పాస్ మిషన్‌లో నమోదు వివరాలను, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఎరువులను ఎంత ధరకు విక్రయిస్తున్నారు, అమ్మకం తదితర విషయాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గీతారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎరువులను విక్రయించాలని.. లేదంటే సంబంధిత డీలర్ షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ పాస్ మిషన్‌లో ఉన్న బ్యాలెన్స్ ప్రకారమే దుకాణాలలో నిల్వ ఉండాలని సూచించారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచుకోవాలని డీలర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీలత, డీలర్లు చంద్రశేఖర్, హన్మంత్‌రెడ్డి, వెంకటేశ్, సుఖేందర్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, మహేశ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం



రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మల్కారం వాసులు

చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి

శంషాబాద్ రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని మల్కారం గ్రామానికి చెందిన పలువురు రాజేంద్రనగర్ పార్టీ ఇన్‌చార్జి కె.నరేందర్ ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్‌లో చేరగా వారికి ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను ఎంపీగా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశానని, మరింత అభివృద్ధికి కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలన్నారు. రైతు సంఘం మండలాధ్యక్షుడు యాదగిరిరెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశ్, సొసైటీ మాజీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, నాయకులు జంగయ్య, జంగిలి తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి మహేందర్, ఉపాధ్యక్షుడు కోటేశ్వర్‌గౌడ్, జీవన్‌గౌడ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫక్రుద్దీన్, డీసీసీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి రఫీక్, మాజీ సర్పంచ్‌లు సిద్దేశ్వర్, చంద్రశేఖర్, ఉపసర్పంచ్ సురేశ్‌నాయక్, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ఆందన్, నాయకులు నవీన్‌రెడ్డి, ప్రభాకర్, రవీందర్‌గౌడ్, లక్ష్మయ్య, శ్రీనుగౌడ్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

'డెత్'లైన్ గేమ్స్!

ఆన్‌లైన్ గేమింగ్‌కు బానిసలుగా మారుతున్న పలువురు

- స్మార్ట్ ఫోన్ వినియోగంతో పెరిగిన ధోరణి
- పందెం కోసం భారీగా నగదు వెచ్చిస్తున్న వైనం
- ఆపై అప్పుల్లో మునిగిపోయి తీవ్ర నిర్ణయాలు

సాక్షి, సిటీబ్యూరో:

- బండ్లగూడ జాగీర్ సన్‌సిటీలో నివసించే భార్యాభర్తలు ఇందిర, ఆనంద్ తమ కుమారుడు విక్కీని చంపి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ దారుణానికి కారణం ఆనంద్ ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసగా మారి అప్పుల పాలు కావడం.
- పంచాయితీ రాజ్ శాఖలో మిషన్ భగీరథ ప్రాజెక్ట్ కీసర విభాగంలో ఏఈగా పని చేస్తున్న గడ్డం రాహుల్ బాబు ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసై ఆ నష్టాలు పూడ్చుకోవడానికి మోసగాడిగా మారి జైలుకెళ్లాడు.
- దుండిగల్‌లోని ఏరోనాటికల్ కాలేజీలో బీటెక్ చదువుతున్న గుడిమల్కాపూర్‌కు చెందిన శీలం మనోజ్ ఆన్‌లైన్ గేమింగ్‌కు అలవాటుపడి, ఆర్థికంగా నష్టపోయి ఆత్మహత్య చేసుకున్నాడు.
- తన భర్త జానారెడ్డి ఆన్‌లైన్ గేమింగ్‌కు అలవాటుపడి డబ్బు పోగొట్టుకోవడంతో ఆర్థిక సమస్యలు చుట్టుముట్టి మన్సూరాబాద్ భవానీనగర్‌కు చెందిన వివాహిత శిరీష ఆత్మహత్య చేసుకుంది.



పురుషులే ఎక్కువ

ఇటీవల కాలంలో ఇలాంటి 'గేమింగ్ ఉదంతాలు' ఎక్కువగా జరుగుతున్నాయి. పురుషులతో పాటు మహిళలూ ఇలాంటి గేమ్స్‌కు బానిసలుగా మారుతున్నారు. అయితే తల్లిదండ్రుల, కుటుంబీకుల కార్డ్స్ వినియోగించి యూసీ పాయింట్లు ఖరీదు చేయడం, పందేలు కావడం వంటివి మాత్రం కేవలం పురుషులే చేస్తున్నారు. ఇప్పటి వరకు మా దృష్టికి వచ్చిన ఉదంతాలు ఈ విషయం స్పష్టం చేస్తున్నాయి. యువతులు, మహిళలు గేమ్స్ ఆడుతున్నా..డబ్బు చెల్లించాల్సి వస్తే వాటికి దూరంగా ఉంటున్నారు.

– జి.రాజేంద్రన్, సైబర్ నిపుణుడు

....గడిచిన నెలన్నర రోజుల కాలంలో వెలుగులోకి వచ్చిన ఈ నాలుగు ఉదంతాలు ప్రస్తుతం సమాజంపై ఆన్‌లైన్ గేమింగ్స్ ప్రభావాన్ని చెప్పకనే చెప్తున్నాయి. ఈ గేమ్స్‌కు అలవాటుపడుతున్న వాళ్లు గెలవడానికి బానిసలుగా మారిపోతున్నారు. దీనికోసం ఆయా కంపెనీల ట్రాప్‌లో పడి వివిధ రకాలైన పాయింట్లు కొంటున్నారు. వాటిని ఖరీదు చేయడానికి, పందెం కాయడానికి అవసరమైన డబ్బు కోసం అప్పులు చేస్తున్నారు. చివరకు ఆ ఉచ్చులో పడి మోసాలు, ఆత్మహత్యల వరకు వెళ్తున్నారు.

పథకం ప్రకారం విస్తరించిన గేమ్స్

కోవిడ్ నేపథ్యంలో దాదాపు రెండేళ్లుగా ఆన్‌లైన్ క్లాసులే నడిచాయి. దీంతో దాదాపు ప్రతి విద్యార్థి చేతికి ఫోన్, ట్యాబ్‌లు వచ్చి చేరాయి. దీన్ని క్యాష్ చేసుకోవడానికి గేమింగ్ కంపెనీలు పథకం ప్రకారం వ్యవహరించాయి. ఆకర్షణీయమైన ప్రకటనలు, లింకుల ద్వారా తమ గేమ్స్‌ను ప్రమోట్ చేశాయి. వీటికి ఆకర్షితులైన విద్యార్థులు, ఉద్యోగులు, యువత వాటిని ఇన్‌స్టాల్ చేసుకుని ఆడటం మొదలెట్టారు. ఆ తర్వాతి రోజుల్లో ఇవి ఆడటం అనేది ఓ వ్యసనంగా మారిపోయింది. ఈ గేమ్స్ అన్నీ వాటి నిర్వాహకులు రూపొందించిన ప్రత్యేక ప్రోగ్రామింగ్ ద్వారా నడుస్తుంటాయి. దీని ప్రకారం గేమ్ ఆడటం కొత్తగా ప్రారంభించిన వారి ఐపీ అడ్రస్ తదితర వివరాలను నిర్వాహకులు సంగ్రహిస్తారు. దీని ఆధారంగా తొలినాళ్లల్లో దాదాపు ప్రతి గేమ్‌లోనూ వాళ్లే గెలిచేలా చేసి తమ ముగ్గులోకి దింపుతారు. వీళ్లకి గెలుపు అనేది ఓ కిక్‌గా మారుస్తారు.

పాయింట్లు, పందేల పేరుతో..

ఇలా తమ గేమ్‌కు బానిసగా మారిన వారిని ఎంపిక చేసుకునే నిర్వాహకులు అసలు కథ మొదలెడుతున్నారు. కొన్ని రోజుల పాటు వాళ్ల ఆయా గేమ్స్‌లో ఓడిపోయేలా చేస్తారు. ఆపై గేమ్‌లో నువ్వు వీక్ అయిపోయావంటూ సందేశాలు పంపి రెచ్చగొడతారు. ఇలా తాను ఎట్టి పరిస్థితుల్లోనూ గెలవాలనే భావన ఆడేవారిలో కలిగిస్తారు. దీనికోసం టిప్స్ ఇస్తున్నామంటూ కొన్ని యూసీ పాయింట్లను ఉచితంగా ఇస్తారు. వీటిని వినియోగిస్తే గేమ్‌లో మీ తరపున ఆడే క్రీడాకారులు బలంగా మారి, గెలుస్తావంటూ చెబుతారు. తొలుత ఈ పాయింట్లు ఉచితమే అంటూ వాటికీ బానిసలుగా మారేలా చేస్తారు. ఆపై ఈ పాయింట్లు రావాలంటే తమకు కొంత మొత్తం చెల్లించాలంటూ వసూలు చేయడం మొదలెడతారు.

అందినకాడికి దండుకుంటారు

కొన్ని రోజుల తర్వాత ఆ యూసీ పాయింట్లు ఉచితంగా ఇవ్వలేమంటూ మెలికపెడతారు. అవి కావాలంటే తమ వద్ద రిజిస్టర్ చేసుకుని, డెబిట్ లేదా క్రెడిట్ కార్డులతో చెల్లింపులు చేయాలని షరతు విధిస్తారు. అప్పటికే ఈ గేమ్స్‌కు బానిసలుగా మారిన వాళ్లు తేలిగ్గా వాటి నిర్వాహకుల ట్రాప్‌లో పడిపోతున్నారు. తమవి లేదా తల్లిదండ్రుల కార్డులు తీసుకుని పేమెంట్లు చేస్తున్నారు. వీటి వివరాలను ఒకసారి నమోదు చేసి, ఆ సందర్భంలో కార్డు యజమానికి వచ్చే ఓటీపీ పొందుపరిచి, ఆటో రీచార్జ్ ఎంపిక చేసుకుంటే పదేపదే కార్డుతో అవసరం ఉండదు. దీంతో అదును చూసుకుని ఈ పని చేస్తున్న యువత అనునిత్యం భారీ మొత్తం ఖర్చు చేసేస్తోంది. ఇలా మళ్లీ గెలుపు అలవాటు చేసిన తర్వాత తమ వద్ద నిర్ణీత మొత్తం పందెం కాసి గేమ్ ఆడితే... భారీ లాభాలు ఉంటాయని చెప్పే కంపెనీలు డబ్బు దండుకుంటున్నాయి. ఇలాంటి గేమ్స్‌లో తొలినాళ్లల్లో తక్కువ మొత్తం పెట్టినప్పుడు లాభం వచ్చినా...పెట్టుబడి పెరిగే కొద్దీ నష్టాలే వస్తుంటాయి. వాటిలో ప్రోగ్రామింగ్ అలా ఉంటుంది. ఈ నేపథ్యంలోనే కొందరు ఆన్‌లైన్ గేమింగ్స్ కోసం యాప్స్‌లో అప్పులు తీసుకుని, ఆ భారం పెరిగిపోయి, వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యల వరకు వెళ్తున్నారు.

యువ నాయకుడిపై సస్పెన్షన్ ఎత్తివేత



ఎమ్మెల్యే సబితను కలిసిన వాసుబాబు

పహాడీషరీఫ్: పార్టీలో కొనసాగుతున్న సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ ఎమ్మెల్యే సబితారెడ్డి నిర్ణయం తీసుకోవడం పట్ల బీఆర్‌ఎస్ నాయకుడు కాట్రగడ్డ వాసుబాబు హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆయన ఎమ్మెల్యే సబిత, యువ నాయకుడు కార్తీక్ రెడ్డిలను కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వాసు మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమి చెందిన సందర్భంగా తన ఆవేదనను వ్యక్తపరిచిన సమయంలో.. పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు తనపై సస్పెన్షన్ వేటు వేశారని తెలిపారు. తీరా చూస్తే ఆయనే స్వార్థంతో కాంగ్రెస్‌లో చేరిపోయారని విమర్శించారు. పార్టీ బలోపేతం కోసం పనిచేస్తానని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. తనకు సహకరించిన సుభాష్ రెడ్డి, డి.రమేష్ ముదిరాజ్, పచ్చ శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

చేవెళ్ల: గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై చేవెళ్ల మండలంలోని మిర్జాగూడ సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆలూరి వినయ్‌కుమార్(24) చేవెళ్లలోని ఓ మెడికల్ షాపులో అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం షాపునకు వచ్చిన ఆయన మధ్యాహ్నం పని నిమిత్తం బయటకు వెళ్లాడు. పనులు ముగించుకొని రాత్రివేళ ఇంటికి బైక్‌పై వెళ్తుండగా మీర్జాగూడ సమీపంలోని రోడ్డు మలుపు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, కొత్తపల్లి గ్రామానికి చెందిన వినయ్‌కుమార్‌గా గుర్తించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

నమ్మించి మోసం చేశాడు

కాచిగూడ: ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. చివరికి నమ్మించి నయవంచన చేశాడు. యువతిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని బుధవారం కాచిగూడ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం .. గోల్నాక కల్లు కాంపౌండ్ సమీపంలో నివాసం ఉంటున్న యువతి ప్రైవేటు ఫార్మసీ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. కొన్నాళ్ల క్రితం సత్యనగర్‌లో నివాసం ఉంటున్న అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. ఆ ఇంటి పక్కనే ఉంటున్న అఖిల్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమకు దారి తీసింది. సదరు యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి ఆమెపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. అఖిల్ మాయ మాటలు నమ్మిన యువతి అప్పుడప్పుడు ఖర్చుల కోసం అతనికి రూ.8 లక్షల వరకు ఇచ్చింది. తనను పెళ్లి చేసుకోవాలని అఖిల్‌పై ఒత్తిడి చేయడంతో.. తన తల్లిదండ్రులు వేరే సంబంధం చూస్తున్నారని చెప్పాడు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు బుధవారం కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

అభివృద్ధిలో దేశం పరుగు

- బీజేపీ పాలనలో దేశానికి పేరుప్రఖ్యాతులు
- మోదీ హ్యాట్రిక్ విజయం ఖాయం
- ప్రజా ఆశీర్వాద యాత్రలో చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- తనను ఆదరిస్తే.. మోదీని గెలిపించినట్లేనని వెల్లడి



ఆశీర్వాద యాత్రలో ప్రసంగిస్తున్న ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: మోదీ పదేళ్ల పాలనలో దేశానికి పేరు ప్రఖ్యాతులు రావడంతో పాటు, ప్రపంచ దేశాలతో పోటీ పడుతూ భారత్ అభివృద్ధిలో దూసుకుపోతుందని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో కొండా చేపట్టిన ప్రజా ఆశీర్వాద యాత్ర బుధవారం శంకర్‌పల్లి మండలం లక్ష్మారెడ్డిగూడ, గాజులగూడ, దోబీపేట్, అలంఖాన్ గూడ, ఫత్తేపూర్, బుల్కాపూర్ మోకిల, ప్రొద్దటూరు, చేవెళ్ల మండలం ఆలూరు, ఎన్కేపల్లి, మీర్జాగూడ, బస్తేపూర్, చనువెల్లి గ్రామాల్లో సాగింది. యాత్రలో కొండా.. ప్రజా సమస్యలు అడిగి తెలుసున్నారు. అనంతరం మాట్లాడారు. యువత మోదీ వెంటే నడుస్తుందని, ఆయన పాలననే దేశ ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా తనను ఆదరిస్తే.. కేంద్రంలో మోదీని గెలిపించినట్లేనని, ప్రధానికి చేవెళ్ల సీటును గెలిపించి కానుకగా అందించాలని కొండా సూచించారు.

కేరళకు పారిపోయిన రాహుల్

మోదీ ప్రభంజనాన్ని చూసి రాహుల్‌గాంధీ కేరళకు పారిపోయారని విశ్వేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ప్రజల మనిషిగా మోదీ పనిచేస్తున్నారన్నారు. రైతులకు రాయితీపై ఎరువులు అందించటంతో పాటు వారు పండించిన పంటలకు మద్దతు ధర, కిసాన్ సన్మాన్ నిధి, పీఎం కిసాన్ ద్వారా పెట్టుబడి సాయం అందజేస్తూ.. అన్నదాతలకు అండగా ఉన్నారని వెల్లడించారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం



మహిళలతో మాట్లాడుతున్న కొండా

చేసినట్లు చెప్పుకొంటున్న అభివృద్ధిలో కేంద్రం నిధులే ఉన్నాయని, గ్రామాలకు రోడ్లు, వైకుంఠ ధామాలు, రైతు వేదికలకు నిధులు సమకూర్చింది బీజేపేనని చెప్పారు.

ఆ పార్టీలను ప్రజలు నమ్మరు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి, ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. ఎన్నికలకు ముందు వందరోజుల్లో అమలు చేస్తామని చెప్పిన వాటిని అమలు చేయటంలో విఫలమవుతున్నారని విమర్శించారు. ధనిక రాష్ట్రమని చెప్పిన కేసీఆర్.. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి దివాలా తీయించారన్నారు. అందుకే ప్రజలు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను నమ్మే పరిస్థితి లేదన్నారు. దేశంలో అవినీతి రహిత పాలన అందించిన ఘనత మోదీకే దక్కుతుందని స్పష్టం చేశారు. అందుకే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ హ్యాట్రిక్ విజయం, మోదీ మరోసారి ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. యాత్రలో భాగంగా పార్టీలో చేరిన వారికి కొండా కండువాలు ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం, మైలార్ దేవులపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ శంకర్‌పల్లి, చేవెళ్ల మండలాల నాయకులు రాములుగౌడ్, అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, జి.వెంకట్‌రెడ్డి, రమణారెడ్డి, అనంత్‌రెడ్డి, కృష్ణాగౌడ్, శర్వలింగం, వెంకట్‌రామ్ రెడ్డి, నాగరాజు, అశోక్, నాయకులు నరింలు, సురేశ్, పరమేశ్వర్‌రెడ్డి, వాసుదేవ్‌కన్న, దినేశ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రవి, జంగారెడ్డి, వెంకటేశ్, లక్ష్మారెడ్డి, అభిలాష్, సత్యనారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

మియాపూర్: ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న నలుగురు బుకీలను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ దుర్గా రామలింగ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం .. మాతృశ్రీనగర్ కాలనీలో శ్రీనిధి సర్వీస్ అపార్ట్‌మెంట్ ప్లాట్ నంబర్ 505లో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు, మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు సంయుక్తంగా మంగళవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. అక్కడ ఏపీలోని గుంటూరుకు చెందిన అల్లూరి త్రినాథ్ (34), రాజేష్(33), స్వామి (30), గణపతిరావు(57)లు బెట్టింగ్ బుకీలుగా గుర్తించారు. ఆల్‌లైన్‌లో క్రికెట్ లైన్ గురు యాప్, లక్కీ ఆన్‌లైన్ యాప్ ద్వారా ఐపీఎల్–2024 మ్యాచ్‌కు సంబంధించి బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలుసుకున్నారు. వెంటనే ఆ నలుగురును అదుపులోకి తీసుకుని విచారించగా గుంటూర్ నర్సరావుపేటకు చెందిన శాఖమూరి వెంకటేశ్వరావు అలియాస్ చిన్ను అనే వ్యక్తి వీరితో కలిసి బెట్టింగ్ ముఠాను నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. నిందితుల నుంచి రూ.40 లక్షల నగదు, బ్యాంక్ ఖాతాలో రూ.3.57 లక్షలు, ఎనిమిది స్మార్ట్ ఫోన్లు, రెండు కీ బోర్డు ఫోన్లు, 3 ల్యాప్‌టాప్‌లు, 2 ట్యాబ్‌లు స్వాధీనం చేసుకున్నారు. వెంకటేశ్వర్‌రావు పరారీలో ఉన్నాడు.

తెలంగాణ సెయిలర్లకు 9 పతకాలు

లక్డీకాపూల్: జాతీయ ర్యాంకింగ్ సెయిలింగ్ టోర్నమెంట్‌లో తెలంగాణ సెయిలర్లు అద్భుత ప్రదర్శన చేశారు. షిల్లాంగ్ (మేఘాలయ)లోని ఉమియం సరస్సులో జరిగిన ఈ టోర్నీలో మొత్తం తొమ్మిది పతకాలు నెగ్గిన తెలంగాణ ఉత్తమ సెయిలింగ్ జట్టు అవార్డును కైవసం చేసుకుంది. మేఘాలయలో తొలిసారి జరిగిన తొలి నేషనల్ ర్యాంకింగ్ ఈవెంట్ ఇదే. కొండలు, అడవుల మధ్య స్వచ్ఛమైన నీటితో నిండిన సుందర ఉమియం సరస్సులో జరిగిన పోటీలో అంచనాలు లేకుండా బరిలోకి దిగిన నల్లకుంట ప్రభుత్వ పాఠశాలకు చెందిన గోవర్ధన్ పల్లారా అండర్– 15 విభాగంలో తొలిసారి జాతీయ టైటిల్ సొంతం చేసుకున్నాడు. నగరానికి చెందిన దీక్షితను ఓడిస్తూ ఓవరాల్ స్వర్ణం పతకాన్ని కూడా కైవసం చేసుకున్నాడు. రసూల్‌పురాలోని ఉద్భవ్ స్కూల్‌కు చెందిన అక్కాచెల్లెళ్లు కొమరవెల్లి దీక్షిత, లహరి 2, 3వ స్థానాల్లో నిలవడంతో పాటు బాలికల స్వర్ణం, రజతాలను గెలుచుకున్నారు. ఒక జాతీయ ఈవెంట్‌లో తెలంగాణకు తొలి మూడు స్థానాలు రావడం ఇదే తొలిసారి. భారత రెండో ర్యాంకర్ బన్నీ బొంగూర్ రెండు పాయింట్ల తేడాతో పాటిగడ్డ ప్రభుత్వ పాఠశాలకు చెందిన రిజ్వాన్ మహ్మద్‌ను ఓడించి కాంస్య పతకం సాధించాడు. అండర్ 18 డబుల్ హ్యాండర్‌లో తనుజా కామేశ్వర్– గణేష్ పీర్కట్ల రజతం సాధించారు. అండర్ 18 సింగిల్ హ్యాండర్‌లో వైష్ణవి వీరవంశం అలవోకగా స్వర్ణ పతకం గెలిచింది. ధరణి లావేటి– క్రూ మల్లేష్ రజత పతకం కైవసం చేసుకున్నారు.

ఎస్సీమోర్చా అభివృద్ధికి సహకరించండి

బీజేపీ ఎస్సీమోర్చా జిల్లా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న జ్ఞానేశ్వర్

మొయినాబాద్‌రూరల్: బీజేపీ ఎస్సీ మోర్చా అభివృద్ధి కోసం అందరూ సహకరించాలని నూతనంగా నియమితులైన ఆ పార్టీ ఎస్సీమోర్చా జిల్లా అధ్యక్షుడు బంటు జ్ఞానేశ్వర్ కోరారు. బుధవారం మండల పరిధి అజీజ్‌నగర్ చౌరస్తాలో చేవెళ్ల పార్లమెంటు మోర్చా నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఎస్సీల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. దేశంలో నరేంద్రమోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమన్నారు. రాష్ట్ర నాయకులు తనపై నమ్మకంతో బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారి బచ్చగళ్ల రమేష్, పార్లమెంటు కోఇన్‌చార్జి నవీన్, నాయకులు సత్యం, శ్రావణ్, రవి, సత్యనారాయణ, గాలయ్య, సదానంద్, నరేందర్, ప్రశాంత్, ప్రభాకర్, రత్నం, రమేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

హోమియోపతితో వ్యాధి నిరోధక శక్తి



- సైడ్‌ఎఫెక్ట్ లేకుండా తక్కువ ఖర్చుతో వైద్యం
- డాక్టర్ కేర్ హోమియోపతి సీఈఓ డాక్టర్ సృజన

లక్డీకాపూల్: వ్యాధి నిరోధక శక్తిని పెంచడంలో హోమియోపతి వైద్యం ముందంజలో ఉంటుందని డాక్టర్ కేర్ హోమియోపతి సీఈఓ డాక్టర్ సృజన పేర్ల తెలిపారు. ఏ విధమైన సైడ్ ఎఫెక్ట్ లేకుండా తక్కువ ఖర్చుతో హోమియోపతి వైద్యాన్ని అందించిన డాక్టర్ శామ్యూల్ హనీమన్‌కు ఎంతో రుణపడి ఉంటామన్నారు. బుధవారం డాక్టర్ కేర్ హోమియోపతి నిర్వహించిన ప్రపంచ హోమియోపతి దినోత్సవంలో డాక్టర్ సృజన పేర్ల మాట్లాడారు. అల్లోపతి వైద్య రంగంలో పట్టభద్రులైన డాక్టర్ శామ్యూల్ సైంటిఫిక్ మెథడ్‌తో హోమియోపతి వైద్యాన్ని అందించినట్లు చెప్పారు. దీర్ఘకాలిక జబ్బులతో పాటు తాత్కాలిక జబ్బులను కూడా నయం చేస్తుందని కోవిడ్ లాంటి విపత్కర సమయంలో నిరూపితమైందన్నారు. డాక్టర్ కేర్ హోమియోపతి, డాక్టర్ పాజిటివ్ హోమియోపతి వ్యవస్థాపకులు డాక్టర్ ఏఎం రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత వేగవంతమైన జీవన విధానంలో ఆధునిక సమాజం తన జీవనశైలిలో మార్పులు చేసుకోవాలన్నారు. డాక్టర్ కేర్ హోమియోపతి వైద్యులు ఫ్యామిలీ వైద్యులుగా సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ కేర్ హోమియోపతి, పాజిటివ్ హోమియోపతి మెడికల్ ఇన్‌చార్జి డాక్టర్ ఎం.నీరజ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులూ.. వినండహో!



కళింగ కల్చరల్ సెంటర్ జంక్షన్‌లో మైక్‌సెట్‌లో వాహనదారులను అప్రమత్తం చేస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

సిగ్నల్ లేని జంక్షన్లలో పోలీసుల అనౌన్స్‌మెంట్లు

బంజారాహిల్స్: సిగ్నల్ లేని జంక్షన్లు, ఐలాండ్‌ల వద్ద వాహనదారులు ఎక్కడ పడితే ఆగడంతో పాటు రాంగ్ రూట్‌లో వస్తూ ప్రమాదాలకు కారణమవుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు అందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని ఒహిరిస్ ఐలాండ్, కళింగ జంక్షన్ వద్ద బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయి ప్రకాశ్ గౌడ్ మైక్‌సెట్ ద్వారా వాహనదారులను అప్రమత్తం చేస్తూ ట్రాఫిక్ సజావుగా సాగేలా చేశారు. ఈ జంక్షన్‌లో నిత్యం తెలంగాణ భవన్ వైపు నుంచి, జానారెడ్డి నివాసం వైపు నుంచి కమాండ్ కంట్రోల్ సెంటర్ వైపు నుంచి వాహనాలు వెళ్తుంటాయి. ఈ క్రమంలో కొంత మంది రోడ్డు మధ్యలో ఆగుతుండటంతో పాటు కొంత మంది తొందరగా వెళ్లాలనే ఆతృతలో రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారని అలాంటి వారిని అప్రమత్తం చేస్తూ ట్రాఫిక్‌ను వేగంగా ముందుకు కదిలేలా చేసేందుకు మైక్‌సెట్ అనౌన్స్‌మెంట్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

పెట్రోల్ దొంగ అరెస్టు

రిమాండ్‌కు తరలింపు

షాద్‌నగర్‌రూరల్: రాత్రి వేళల్లో వాహనాల నుంచి పెట్రోల్‌ను దొంగతనంగా తీస్తున్న దొంగను పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. డీఐ రాంరెడ్డి వివరాల ప్రకారం.. పట్టణంలోని నెహ్రూనగర్ కాలనీకి చెందిన ప్రవీణ్‌కుమార్ ఈ నెల 6న తన ద్విచక్ర వాహనాన్ని ఇంటిముందు పార్కు చేశాడు. అదే రోజు అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కొందరు బైక్ నుంచి పెట్రోల్‌ను దొంగిలించారు. ఇదే విషయమై సదరు వాహనదారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్(డీఐ) రాంరెడ్డి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా గణేశ్ కుమార్‌ను నిందుతుడిగా గుర్తించి, 3 లీటర్ల ఇంధనాన్ని స్వాధీనం చేసుకున్నారు. గణేశ్‌తో పాటు మరో ఇద్దరు ఈ కేసులో ఉన్నారని, వారు పరారీలో ఉన్నారని, త్వరలో పట్టుకుంటామని పోలీసులు పేర్కొన్నారు. విచారణ అనంతరం నిందితుడు గణేశ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు డీఐ రాంరెడ్డి తెలిపారు. కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన క్రైం బృందం సభ్యులు మోహన్, జాకీర్, రాజు, యాదగిరి, రఫీలను డీఐ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రంజాన్ వేళ విషాదం

షాద్‌నగర్‌రూరల్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని లారీ ఢీ కొట్టడంతో అతను అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన షాద్‌నగర్ పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నయూమొద్దీన్ వివరాల ప్రకారం.. ఫరూఖ్‌నగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్‌సలీం(49) పాత సామాను(స్క్రాప్) దుకాణం నిర్వహిస్తున్నాడు. కుటుంబం సభ్యులతో కలిసి మహమూద్‌నగర్‌కాలనీలో నివాసం ఉంటున్నాడు. సొంత పనిపై షాద్‌నగర్‌కు వచ్చి, కాలి నడకన ఇంటికి బయల్దేరాడు. ఈ క్రమంలో సలీం మండల పరిషత్ కార్యాలయం ఎదుట రోడ్డును దాటుతుండగా హైదరాబాద్ నుంచి జడ్చర్లవైపు వెళ్తున్న కంటైనర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ తలపై నుంచి వెళ్లడంతో అబ్దుల్ అక్కడికక్కడే చనిపోయాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ.. ఏఎస్‌ఐ రాంచందర్‌తో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. మృతుడి కుమారుడు మహ్మద్ అబ్దుల్ ఖలీల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇదిలా ఉండగా.. తెల్లవారితే కుటుంబ సభ్యులతో రంజాన్ పండుగ జరుపుకోవాల్సిన సలీం.. రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. కుటుంబ సభ్యుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి.

వాహనాల దొంగలకు రిమాండ్



పట్టుబడిన దొంగలు

కందుకూరు: మోటారు వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మక్బూల్‌జానీ తెలిపిన వివరాల ప్రకారం.. తుక్కుగూడ మున్సిపాలటీ పరిధి కొంగర కలాన్‌కు చెందిన తెపర్ల భీమేష్(24), కొత్ర యాదయ్య అలియాస్ యాదగిరి(20)తో పాటు మరో బాలుడు(17) కలిసి కందుకూరు, యాచారం మండలాల పరిధిలో తరచూ మోటార్ వాహనాల చోరీకి పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో నిఘా పెట్టిన పోలీసులు.. బుధవారం కందుకూరు చౌరస్తాలో వాహనాల తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు ఎస్‌ఐ శ్రావణ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం



సాయి కుమార్ (ఫైల్)

పహాడీషరీఫ్: పనికని వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మామిడిపల్లి రంగ నాయకుల కాలనీకి చెందిన సలేశ్వరం కుమారుడు ఆకాది సాయి కుమార్(26) సరూర్‌నగర్‌లోని శ్రీసాయి సర్జికల్ కంపెనీలో పని చేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా ఈ నెల 8న ఉదయం డ్యూటీకి వెళ్లిన సాయి.. సాయంత్రం 5 గంటలకు తల్లి భాగ్యకు ఫోన్ చేశాడు. ఆఫీస్ పని మీద జీడిమెట్లకు వెళ్తున్నానని చెప్పాడు. కానీ ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో ఆమె కంపెనీలో వాకబు చేయగా, ఆ రోజు అతడు అసలు డ్యూటీకి రాలేదని తెలిసింది. సాయి కోసం పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆమె బుధవారం ఠాణాలో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టారు. సాయి ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.